

పర్యావరణహితంగా చవితి వేడుకలు

పర్యావరణ పరిరక్షణ కోసం వినాయక చవితి పండుగ రోజు మట్టి ప్రతిమలు ప్రతిష్టించాలని ఎంపీ గురుమూర్తి కోరారు. - IIలో



'అమృత్'తో భూగర్భ జలాల అభివృద్ధి

అమృత్ సరోవర్ పనులతో భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని కేంద్రం డిప్యూటీ కార్యదర్శి తెలిపారు. - IIలో



మహిళా కార్మికుల ధర్నా

నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో లాయల్ టెక్స్‌టైల్స్ లాకౌట్ ప్రకటించడంపై మహిళా కార్మికులు ధర్నాకు దిగారు. - IIలో

న్యూస్‌రీల్

మట్టి ప్రతిమలు మేలు



వెంకటేశ్వర్, కలెక్టర్

తిరుపతి అర్బన్ : వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి ప్రతిమల వినియోగమే మేలని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లావాసులకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

10న ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 10వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లలిత తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మేళా జరుగుతుందన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే వారు ఆధార్, విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్సులు, బయోడేటాతో రావాలని సూచించారు. ముందుగా సంబంధిత వెబ్‌సైట్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. వివరాలకు 7989509540, 8919889609 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

13న టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి సమీపంలోని అగ్రహారం వద్ద ఈ నెల 13వ తేదీన టెన్నిస్ బాల్ క్రికెట్ అండర్–19 బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ 2005 తర్వాత జన్మించిన బాలబాలికలు పోటీలకు అర్హులన్నారు. వివరాలకు 94902 52821 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వరద బాధితులకు రూ.36లక్షల విరాళం



పీడీ రాధమ్మకు చెక్ అందిస్తున్న మెప్మా సభ్యులు

తిరుపతి తుడా : ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన మున్సిపల్, కార్పొరేషన్ పరిధిలోని మెప్మా సంఘ సభ్యులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 36,14,078 విరాళంగా అందించారు. శుక్రవారం ఈ మేరకు మెప్మా పీడీ రాధమ్మకు చెక్ అందించారు. గుంటూరు మిషన్ డైరెక్టర్ రిలీఫ్ ఫండ్ ఖాతాలో నగదు జమ చేశారు.

మహిళా వర్సిటీలో ఈఈఈ అసోసియేషన్



జ్యోతి ప్రజ్వలనలో దేవేంద్రనాథ్‌రెడ్డి

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం అసోసియేషన్‌ను శుక్రవారం ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ దేవేంద్రనాథ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ప్రావీణ్యం సాధించిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈఈఈ అసోసియేషన్ ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వీసీ వీరారెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రెసిడెంట్ డి.హిమబిందు, ఉపాధ్యక్షులు నర్మిత, కార్యదర్శి పూజా, జాయింట్ సెక్రటరీలు జస్వంతి, సింధు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణం ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 61,142 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,525 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.20 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

అంగరంగ వైభవం — ఆకర్షణీయం



కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో దేదీప్యకాంతులు విరజిమ్ముతోంది. వినాయక చవితిని పురస్కరించుకుని భువి కైలాసంగా విరాజిల్లుతోంది. విద్యుద్దీపాలు.. విశేష పుష్పాలంకరణలో కనులపండువగా ఆకట్టుకుంటోంది. గణనాథుని సేవకు అశేషంగా తరలిరానున్న భక్తకోటికి స్వాగతం పలుకుతోంది. గణేశుని దివ్యతేజస్సును ఇనుమడింపజేస్తోంది. - కాణిపాకం

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో 10వేల తమలపాకులతో తయారు చేసిన గణపతి ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంటోంది. శ్రీకల్యాణ వెంకన్న ఆలయ ప్రాంగణంలోని మండపంలో ఈ ప్రత్యేక విగ్రహం కొలువుదీరింది. పది మంది నిపుణులు 10 అడుగుల ఎత్తు, 7 అడుగుల వెడల్పు బొమ్మను సిద్ధం చేశారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విశిష్ట గణనాథుని ప్రతిమను తీర్చిదిద్దినట్లు నిర్వాహకుడు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. - తిరుపతి రూరల్



అభివృద్ధే అజెండా

- జెడ్పీ సర్వ సభ్య సమావేశంలో చైర్మన్ శ్రీనివాసులు
- ఇసుకపై ప్రజాప్రతినిధుల వాగ్వాదం
- పకడ్బందీగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టాలని ఎంపీ డిమాండ్

చిత్తూరు కార్పొరేషన్: పార్టీలకు తీతంగా అభివృద్ధే అజెండాగా సమష్టిగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక జెడ్పీ తొలి సర్వ సభ్య సమావేశం శుక్రవారం చిత్తూరులోని జిల్లా పరిషత్‌సమావేశ మందిరంలో నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలపై చర్చించి పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జెడ్పీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు ప్రాధాన్యత వారీగా పరిష్కరించాలని ఆదేశించారు.

మదనపల్లెలో టమాట మోసం

మదనపల్లె టమాట మార్కెట్‌లో జాక్‌పాట్ పేరిట రైతులను వ్యాపారులు దోచుకుంటున్నా వారిపై చర్యలు తీసుకోకుండా అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్ ఆరోపించారు. 35 కేజీలు టమాటాలు తీసుకొని 30 కేజీలకు మాత్రమే డబ్బులు ఇస్తున్నారని, ఇకనైనా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమల హబ్ ప్లీజ్

పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల మధ్య పరిశ్రమల హబ్ ఏర్పాటు చేయాలని జీడీనెల్లూరు ఎమ్మెల్యే థామస్ కోరారు. ఆస్పత్రిలో నర్సులు రోగులకు వైద్య సేవలు అందించకుండా రీల్స్ చేసుకుంటూ, చూసుకుంటూ ఉన్నారని ఆరోపించారు. తిరుపతిలో హౌసింగ్ కాలనీల్లో ఇళ్లు పొందిన లబ్ధిదారుల వివరాలు ఇవ్వాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు.

ఇసుక దుమారం

గృహ నిర్మాణ శాఖ అంశంపై చర్చ జరుగుతుండగా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఇసుక సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, అంతేకాకుండా గృహ నిర్మాణాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదన్నారు. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ విభేదించారు. దీంతో జెడ్పీటీసీ సభ్యులు, ఆ ఎమ్మెల్యే నడుమ వాగ్యుద్ధానికి దారితీసింది.

సగం అంశాలపై మాత్రమే చర్చ

సభ్యులు ప్రస్తావించిన సమస్యలను ప్రాధాన్యత వారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. సమావేశంలో మొత్తం వ్యవసాయ, విద్య, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ, విద్యుత్, పంచాయతీరాజ్, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, స్త్రీ మరియు శిశు సంక్షేమం.. వరంగా మొత్తం 10 అంశాలపై అజెండాలో పెట్టారు. కానీ వాటిలో మొదటి 5 అంశాల పై మొక్కుబడిగా అధికారులు ప్రగతి నివేదిక తెలియజేసి, మిగిలిన అంశాలపై చర్చించకనే సమావేశం ముగించారు. సీఈఓ గ్లోరియా, ఎమ్మెల్సీ భరత్, జేసీ విద్యాధరి, మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, సహాయ కలెక్టర్ హిమవంశీ, తిరుపతి డీఆర్‌ఓ పెంచలకిషోర్, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చిత్రంలో చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, సీఈఓ గ్లోరియా, ప్రజాప్రతినిధులు, అధికారులు

'రైతు భరోసా' ఎందుకివ్వరు?

వ్యవసాయ రంగంలో పెట్టుబడి అందక రైతులు ఇబ్బందులు 'రైతు భరోసా' ఇప్పటికీ ఎందుకు ఇవ్వలేదని రామసముద్రం జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. వ్యవసాయాన్ని పండుగ చేయకపోయినా ఫర్వాలేదు కానీ కనీస అవసరాలు తీర్చకపోతే రైతు బతికేది ఎలా? అని నిలదీశారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పై నిలదీసిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి జిల్లాలో చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్‌పై వైద్య ఆరోగ్య శాఖ అధికారులను తిరుపతి ఎంపీ గురుమూర్తి నిలదీశారు. వైద్య ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 77,717 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయగా, 190 మందికి నిర్ధారణ అయినట్లు నివేదికలో ఇచ్చారన్నారు. వాస్తవానికి గత ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మొట్ట మొదటగా తిరుపతి జిల్లాలో రెండు 'పింక్ బస్సుల్లో' క్యాన్సర్ స్క్రీనింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయించి, వైద్య పరీక్షలు నిర్వహిస్తూ స్విమ్స్‌తో అనుసంధానం చేశారన్నారు. 19 ప్రైమరీ హెల్త్ సెంటర్ల పరిధిలో 2,70,234 మంది ఉండగా ఎంఎల్‌హెచ్‌పీల ద్వారా 1,76,776 మందిని సర్వే చేసి, వీరిలో 78,847 మందికి పాజిటివ్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. నిర్ధారణ పరీక్షల కోసం 'పింక్ బస్సు'లో పరీక్షించుకున్న 8053లో 929 మందికి క్యాన్సర్ ఉందని నిర్ధారణైందన్నారు. అయితే 'పింక్ బస్సు' వద్దకు నిర్ధారణ పరీక్షలకు రావలసిన వారు ఇంకనూ70 వేల మంది ఉన్నారన్నారు. వీరందరికీ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఎంతమంది వ్యాధి బారిన పడ్డారో తెలుస్తుందని, ప్రస్తుతం క్యాన్సర్‌తో 250 మంది చికిత్స పొందుతున్నారన్నారు. ప్రాథమిక దశలో నిర్ధారణ చేస్తే వ్యాధి నివారణకు అవకాశం ఉంటుందని, అధికారుల నడుమ సమన్వయం కొరవడి సరైన డేటాని నిక్షిప్తం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

ఫ్రీ హోల్డ్ విధానం పెట్టండి

కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్రీ హోల్డ్ విధానం ఆపివేసిందని, తిరిగి ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి జెడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

డీఈఓల గైర్హాజరుపై ఎమ్మెల్సీ పర్వతనేని ఆగ్రహం



మూడు జిల్లాలకు సంబంధించి చర్చ జరుగుతుంటే చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖాధికారులు సమావేశానికి రాకపోవడంపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో టీచర్ల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా సర్దుబాటు చేయడం సరికాదని ఆక్షేపించారు. అంతేకాకుండా స్టూడెంట్స్ నమోదు డేటాను తప్పుగా చూపి వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో అధికారులు కొందరికి మేలు కలిగేలా చక్రం తిప్పారని ఆరోపించారు. అలాగే, బైజుస్ ట్యాబుల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలోని స్కూళ్లలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లలో 144 ప్లాంట్లు మరమ్మతులకు గురైనా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

పింఛన్.. తొలగించెన్!

చంద్రబాబు తన సహజ శైలిలోనే పాలన సాగిస్తున్నారు. ఎన్నికల హామీలను యథేచ్ఛగా తుంగలో తొక్కేస్తున్నారు. 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని ఊదరగొట్టి.. ఇప్పుడు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ క్రమంలోనే అందరూ భయపడినట్టు పింఛన్‌లపై వేటు వేసేస్తున్నారు. వివిధ సాకులు చూపెట్టి లబ్ధిదారుల సంఖ్య తగ్గిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే జిల్లావ్యాప్తంగా వేలాదిమందికి పెన్షన్లు తొలగించేశారు. అర్హత ఉన్నా కొత్తవారికి పింఛన్ మంజూరు చేయకుండా ఉసూరుమనిపిస్తున్నారు.

- రెండు నెలల్లోనే 2,073 పెన్షన్లకు మంగళం
- నూతన లబ్ధిదారులకు లేని అవకాశం
- 50 ఏళ్లకే పింఛన్ హామీ అమలులో జాప్యం

తిరుపతి అర్బన్ : కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు గడిచిపోయాయి. అయితే 50ఏళ్లకే బీసీలకు పింఛన్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఊసే ఎత్తడంలేదు. కొత్త హామీలు పక్కన బెడితే..పాత పింఛన్‌లను సైతం తొలగిస్తున్నారు. ఆగస్టులో 1,390 మంది, సెప్టెంబర్‌లో 683 మంది, మొత్తం 2,073 పింఛన్లు తొలగించారు. ఇన్నేళ్లుగా పింఛన్ తీసుకుంటూ ఉంటే ఇప్పుడు వచ్చి తమ కడుపు కొట్టారని బాధితులు మండిపడుతున్నారు. వచ్చే అక్టోబర్‌లో మళ్లీ ఎంత మంది పింఛన్లు తొలగిస్తారో అని పలువురు ఆందోళన చెందుతున్నారు.

అకారణంగానే..

జిల్లావ్యాప్తంగా జూలైలో 2,69,162 మందికి పెన్షన్ ఇచ్చారు. అయితే ఆగస్టులో మాత్రం 2,67,772 మందికి మాత్రమే పంపిణీ చేశారు. ఈ క్రమంలోనే సెప్టెంబర్‌లో 2,67,089 మందికి మాత్రమే పింఛన్ ఇస్తున్నట్లు డీఆర్‌డీఏ అధికారులు వెల్లడించారు. అక్టోబర్‌లో సైతం భారీగా కోత విధించనున్నట్లు టీడీపీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. పార్టీల పేరు చెప్పి పింఛన్లు తొలగించడమేంటని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, వితంతువులు, ఒంటరి మహిళలపై ఇలాంటి వైఖరి చూపడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



ఆ ఊసే లేదు..!

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 1,850 మంది కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. ఇక ఈ ఏడాదిలో తొలిదశ పింఛన్ మంజూరు లేనట్టే అంటూ అధికారులు చెబుతున్నారు. కొత్తవి ఇవ్వకపోగా, పాత వాటిని కూడా తొలగిస్తుండడంతో పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదురుచూపు

ఎన్నికల సమయంలో 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. అధికారంలో వచ్చిన తర్వాత ఆ సంగతే మరిచారు. జిల్లాలో 50 ఏళ్ల దాటిన బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలు దాదాపు 1.5 లక్షల మంది ఉన్నారు. వీరిలో కనీసం లక్ష మంది అర్హులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరందరూ చంద్రబాబు హామీ అమలు కోసం ఎదురు చూస్తున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. తొలి దశగా జనవరి 1వ తేదీ నుంచి మే 31 వరకు వచ్చిన పింఛన్ దరఖాస్తులను జూన్‌లో పరిశీలించేవారు. అర్హులకు జూలై 1వ తేదీన పింఛన్ కార్డులు అందించేవారు. అలాగే రెండో దశగా జూలై 1 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించేవారు. డిసెంబర్‌లో పరిశీలన పూర్తి చేసి, జనవరి 1వ తేదీన కొత్త పింఛన్ కార్డులు అందజేసేవారు. ఒక్కో దశలో కనీసం వెయ్యి చొప్పున మొత్తం ఐదేళ్లలో 9 విడతల్లో జిల్లావ్యాప్తంగా 8,970 మందికి నూతన పింఛన్ కార్డులు పంపిణీ చేశారు.

పంపిణీలోనూ ఇక్కట్లే

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఓట్ల కోసం వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని, వేతనాలను రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. దీంతో ఇంటి వద్దకే పింఛన్ కార్యక్రమం ఓ ప్రహసనంగా మారిపోయింది. సచివాలయ ఉద్యోగులు 30 శాతం మందికి మాత్రమే ఇంటి దగ్గర పింఛన్ పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 70 శాతం మందికి రచ్చబండలు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాలు, రోడ్లు, సచివాలయాల వద్ద ఇచ్చినట్లు సమాచారం.

కొత్త పింఛన్లు ఇవ్వాలి

టీడీపీ అధినేత చంద్ర నాయుడు ఎన్నికల సమయంలో 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. ఇది మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పింఛన్ మంజూరు చేయడంలేదు. నాకు ప్రస్తుతం 56 ఏళ్లు. బాబు హామీ మేరకు వృద్ధాప్య పింఛన్ పొందేందుకు అర్హత ఉంది. ఈ నేపథ్యంలో కొత్త పింఛన్ ఇవ్వాలి.

– నజీర్‌బాషా, బైరాగిపట్టెడ, తిరుపతి

మళ్లీ నమ్మరు

ఎన్నికల సమయంలో 50 ఏళ్ల నిండిన బీసీలకు వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని చంద్రబాబునాయుడు చెప్పారు. దాంతో మేము ఆయనకే ఓట్లు వేశాం. అధికారంలోకి వచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మాకు పింఛన్ ఇప్పించాలని కోరుతున్నాం.ఇప్పుడు మోసం చేస్తే...మరోసారి ఆయనకు అవకాశం దక్కదని చెబుతున్నాం. జీవితంలో ఆయన్ని ఎవరూ మళ్లీ నమ్మరు. పేద కుటుంబానికి చెందినవాళ్లం. పింఛన్ అందించి ఆదుకోవాలని కోరుతున్నాం.

– రమణయ్య యాదవ్, కొర్లగుంట, తిరుపతి

అమెరికా పర్యటనకు ఎస్వీయూ అధ్యాపకుల బృందం

- అభినందించిన వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు



అమెరికా పర్యటనకు వెళుతున్న అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని పలు విభాగాలకు చెందిన సుమారు ఆరుగురు అధ్యాపకుల బృందం ఈనెల 8వ తేదీన అమెరికా పర్ద్యూ యూనివర్సిటీ పర్యటనకు వెళ్లనుంది. సుమారు 20రోజుల పాటు వర్సిటీలో పలు అంశాలపై శిక్షణ పొందనున్నారు. రుసా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, ఎంట్రపెన్యూర్‌షిప్ పరిశీలన చేసి వర్సిటీలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పర్యటను చేపట్టనున్నారు. శిక్షణకు హాజరవుతున్న వారిలో రుసా కో–ఆర్డినేటర్లు ప్రొఫెసర్ రమాశ్రీ, ప్రొఫెసర్ ఉషారెడ్డి, వైరాలజీ విభాగం ప్రొఫెసర్ ఎం హేమ, ఇంగ్లీషు విభాగం ప్రొఫెసర్ కొలకలూరి సుమకిరణ్, హోమ్‌సైన్స్ ప్రొఫెసర్ సుచరిత, రుసా సీఈఓ రాయల వంశీకృష్ణ ఉన్నారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ చేపట్టిన అంశాల్లో ఉత్తమ శిక్షణ తీసుకుని, విద్యార్థుల ఉన్నతికి వినియోగించాలని కోరారు. ఎస్వీయూ ఖ్యాతిని అంతర్జాతీయస్థాయిలో చాటాలని సూచించారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.74,070
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,713
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.85,700
రిటైల్ వెండి గ్రాము రూ.88.70

క్లుప్తంగా

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా కరీముల్లా షరీఫ్



తిరుపతి క్రైమ్ : ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా కరీముల్లా షరీఫ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈశ్వర్ రెడ్డి 2 నెలల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జిగా విధులు నిర్వర్తిస్తున్న కరీముల్లాకు పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

చికిత్స పొందుతూ యువతి మృతి


కళావతి మృతదేహం

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రంలో నాలుగు రోజుల క్రితం ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి పడి చికిత్స పొందుతున్న కళావతి(28) శుక్రవారం మృతి చెందింది. మహిళా వర్సిటీలో టీచింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కళావతి ఇంటి మిద్దెపైన బట్టలు ఆరవేస్తూ కింద పడింది. తలకు బలమైన గాయం కావడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సపొందుతూ మరణించింది. మృతురాలి తండ్రి చెంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఎస్కే మూర్తి తెలిపారు.

చోరీకి విఫలయత్నం

చంద్రగిరి : మండలంలోని పనపాకం పంచాయతీ తూర్పుపల్లికి చెందిన దామోదర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం రాత్రి దామోదర్ ఆరు బయట నిద్రించగా, ఆయన భార్య, వదినలు ఇంట్లో పడుకున్నారు.ఈ క్రమంలో శుక్రవారం వేకువ జామున ఇద్దరు దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువా తీస్తుండగా శబ్దం రావడంతో ఇంట్లో నిద్రిస్తున్న మహిళలు లేచి కేకలు వేశారు. దీంతో దుండగులు పరారయ్యారు. ఈ మేరకు దామోదరం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రావి ఆకుపై గణనాథుడు



చిల్లకూరు మండలంలోని పారిచర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేసే వెంకట రమణయ్య రావి ఆకులపై గణేశ్ చిత్రాన్ని రూపొందించి అబ్బురపరిచారు. ఆయనను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

-చిల్లకూరు

బాదంకాయపై బొజ్జ గణపయ్య

చిత్తూరు జిల్లాలోని యాదమరి ప్రభుత్వ పాఠశాలలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దామోదరాచారి బాదం కాయపై విఘ్నేశ్వరుడిని చిత్రీకరించారు. ఇందుకుగాను అక్రిలిక్ రంగులను వినియోగించినట్లు తెలిపారు.

-చిత్తూరు కలెక్టరేట్



సేవకు నంది పురస్కారాలు

తిరుపతి అర్బన్ : మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పురస్కార ప్రధానోత్సవానికిఅందరూ ఆహ్వానితులేనని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్. సరోజనమ్మ శుక్రవారం తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అంకిత భావంతో పనిచేస్తూ విద్యారంగ అభ్యున్నతికి పాటుపడుతున్న వారితో పాటు వైద్య, సామాజిక, సాంస్కృతిక, ఇతర రంగాల్లో శిక్షణ అందిస్తున్నవారి సేవలను గుర్తించామని వెల్లడించారు. రాధాకృష్ణన్ 136వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 11 గంటలకు తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించనున్న గురుపూజోత్సవం కార్యక్రమంలో జీవిత సాఫల్య బంగారు నంది పురస్కారాలు, ఎక్సలెన్సీ పురస్కారాలు, ఉత్తమ గురువు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

పర్యావరణ హితంగా చవితి వేడుకలు


పూజలు నిర్వహిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, ఉత్సవ కమిటీ సభ్యులు

తిరుపతి కల్చరల్ : వినాయక చవితి పండుగలో పర్యావరణ హితంగా మట్టి గణపతినే పూజిద్దామని పిలుపునిస్తూ రూపొందించిన పోస్టర్‌ను శుక్రవారం వినాయక ఉత్సవ కమిటీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష హాజరయ్యారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పర్యావరణం కలుషితం కాకుండా మట్టి వినాయకులను మాత్రమే ప్రతిష్ఠించాలని కోరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పర్యావరణ రహితమైన పండుగ చేసుకున్నప్పుడే స్వామివారి అనుగ్రహం పొందగలమని తెలిపారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఉత్సవ కమిటీతో మూడేళ్లుగా పరిచయం ఉందని, చాలా చక్కగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. తిరుపతి నగరంలో క్రమశిక్షణతో కూడుకున్న పండుగ జరుపుకునేందుకు కమిటీతో మండప నిర్వాహకులు కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, ఆర్‌సీ మునికృష్ణ, కరాటే శ్రీనివాస్, ఎస్‌వీఎం వెంకటేష్, గుండాల గోపీనాథ్, చెన్నం నవీన్, హేమ కిరణ్, ఎంవీఎస్ మణి, ఆకుల సతీష్, బాలభాస్కర్, మణికంఠ, ఆనంద్లక్ష్మి, చెంగారెడ్డి, వినాయక సాగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాల పంపిణీ


మట్టి విగ్రహాలను అందిస్తున్న నరేంద్రబాబు

తిరుపతి అర్బన్ : నగరంలోని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం వద్ద శుక్రవారం ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సీనియర్ ఇంజినీర్ నరేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి మీ ప్రాంతంలో మట్టివిగ్రహాలతోనే పండుగ జరుపుకోవాలని సూచించారు. ప్రధానంగా తిరుపతి నగరంలో మట్టి విగ్రహాల ఆవశ్యకతను గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ అశోక్ కుమార్‌తో పాల్గొన్నారు.

ఏకవీర సేవా ఫౌండేషన్, రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో..

తిరుపతి కల్చరల్ : ఏకవీర సేవా ఫౌండేషన్, రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయ వీధిలో శుక్రవారం సుమారు 500 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి మాట్లాడుతూ తొలి పూజ అందుకునే ఆదిదేవుడు , విఘ్నాలు తొలగించి శుభాలను కలిగించే వినాయకస్వామి పండుగను సాంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎన్ రాజా, కల్యాణి, ప్రవీణ్, సాయి, ముత్యాలరెడ్డి పాల్గొన్నారు.

'అమృత్'తో భూగర్భ జలాల అభివృద్ధి

ఏర్పేడు : అమృత్ సరోవర్ పనులతో భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కార్యదర్శి ఆశిష్ గుప్త తెలిపారు. శుక్రవారం ఏర్పేడు మండలంలోని కోబాక, బండారుపల్లెలో అమృత్ సరోవర్, పాగాలి ఎంఐ ట్యాంకు పనులను పరిశీలించారు. ముందుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీతో వలసల నివారణ జరుగుతుందనని చెప్పారు. ఇలాంటి పనులు చేపట్టడం ద్వారా పరిసరాల్లో భూగర్భ జలాల వృద్ధి జరుగుతుందన్నారు. పరిశుభ్రమైన తాగునీరు అందుతుందన్నారు. అమృత్ సరోవర్‌లో చేపల పెంపకం చేపట్టడం ద్వారా పంచాయతీకి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీడీ సరిత, ఎంపీడీఓ గిడ్డయ్య, ఏపీఓ దేవరి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

రామచంద్రాపురం: మండలంలోని గణేశ్వరపురం పంచాయతీలో చేపట్టిన ఉపాధిహామీ పనులను శుక్రవారం డిప్యూటీ సెక్రటరీ ఆశిష్‌గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. గణేశ్వరపురంలో రైతు ఈశ్వర్‌ప్రసాద్ నాయుడుకు చెందిన పట్టుపురుగుల షెడ్డును పరిశీలించారు. పట్టు పురుగుల పెంపకం ద్వారా 20 రోజులు కవ్వవధిలో రూ.45వేలు ఆదాయం పొందుతున్నట్లు రైతు తెలియజేశారు. అనంతరం ఆశిష్‌గుప్తా మాట్లాడుతూ ఉపాధి హామీలో వ్యవసాయ సంబంధిత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఏపీడీ పద్మలత, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ హంసవేణి, జేఈ మమత, టీఏలు నాగరాజు, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.


బండారుపల్లెలో మొక్క నాటుతున్న ఆశిష్ గుప్త

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి అర్బన్ : వ్యవసాయంలో అధిక దిగుబడి సాధించేందుకు మెలకువలు తెలియజేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతుకు పంటల సాగుపై సూచనలు చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంతోపాటు అనుబంధ రంగాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు, ఏడీఏ ధనంజయరెడ్డి, ఏఓలు హరిత, గాయత్రి, వాణి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మహిళా కార్మికుల ధర్నా

నాయుడుపేటటౌన్ : మండలంలోని మేనకూరు సెజ్‌లో ఉన్న లాయల్ టెక్స్‌టైల్స్ వద్ద శుక్రవారం మహిళ కార్మికులు ధర్నాకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమ లాకౌట్ ప్రకటించడంపై ఆందోళన చేపట్టారు. కంపెనీ ప్రతినిధులు ముందస్తుగా ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు సైతం ధర్నాకు మద్దతు పలికారు. సీఐటీయూ నేత ముకుందా మాట్లాడుతూ లాయల్ పరిశ్రమలో మొత్తం 600 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారని, ఇప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని మండిపడ్డారు.


లాయల్ పరిశ్రమ ఎదుట బైఠాయించిన మహిళ కార్మికులు

దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దారు గీతావాణి అక్కడకు చేరుకుని పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులతో చర్చించారు. కార్మికులకు రావాల్సిన జీతాలు, అలవెన్సు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పాకాల : గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లోసీఐ మద్దయ్య ఆచారి వివరాలను వెల్లడించారు. దామలచెరువు పంచాయతీ రాజీవ్ కాలనీకి చెందిన భాస్కరయ్య కమారుడు చంద్రశేఖర్ జులాయిగా తిరిగే వాడు. ఈ క్రమంలో స్కూటర్ దొంగతనాలకు పాల్పడే ముద్దనపల్లెకు చెందిన సూర్యప్రకాష్‌తో స్నేహం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జూన్ నెల 11వ తేదీ దామలచెరువు సమీపంలో పెదరాయని చెరువు వద్ద ఇరువురు మద్యం సేవించి రూ.3 వేలు అప్పు విషయంలో గొడవ పడ్డారు. చంద్రశేఖర్ పక్కనే ఉన్నరాయితో సూర్యప్రకాష్‌పై దాడి చేసి చంపేసి పరారయ్యాడు. గురువారం ఉప్పరపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జ్ సమీపంలో నిందితుడు ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చంద్రశేఖర్ తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని, మెజిస్ట్రేట్ ముందు ముద్దాయిని హాజరు పరచనున్నట్లు సీఐ వెల్లడించారు. మృతుడు సూర్యప్రకాష్‌పై పలు స్కూటర్ చోరీ కేసులు, ఒక హత్యాయత్నం కేసు ఉన్నట్లు వివరించారు.

వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జైలు

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. అందులో తిరుపతికి చెందిన ఎం గిరిబాబుకు 3 రోజులు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా, కార్వేటినగరానికి చెందిన ఆటో డ్రైవర్ జె శరవణ కుమార్ ,తిరుపతికి చెందిన ఆటో డ్రైవర్లు ఎం.ప్రసాద్, ఎస్.మహమ్మద్ ఆజామ్ ఒక్కొక్కరికి 2 రోజుల జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

ఎర్ర దొంగకు ఐదేళ్లు..

ఎర్రచందనం చెట్లను నరికి, దుంగలను తరలిస్తున్న కేసులో తిరుపతి రూరల్, దామినీడు, ఇందిరమ్మ అపార్ట్‌మెంట్‌కు చెందిన వేమన్న కుమార్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ ప్రత్యేక కోర్టు జడ్జి ఏ. నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైసెన్ ఆఫీసర్ చంద్రశేఖర్ రాజు తెలిపిన కేసులోని వివరాల మేరకు... 2017 అక్టోబర్ 30వ తేదీన వేమన్న కుమార్ 58 కిలోల 2 ఎర్రచందనం దుంగలను తరలిస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నగేష్ వాదించారు.

తిరుమలలో ఇద్దరి ఘర్షణ

తిరుమల : తిరుమలలో ఇద్దరు వ్యక్తులు టీ కోసం ఘర్షణకు దిగిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ మురళీమోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా, సుండుపల్లెకు చెందిన ఉదయకుమార్ తిరుమలలో టీ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే అనంతపురం జిల్లా కదిరికి చెందిన నర్సింహులు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కౌస్తుభం అతిథిగృహం వద్ద ఉదయకుమార్ నుంచి టీ కొనుగోలు చేసిన నర్సింహులు టీ నాణ్యత బాగాలేదని డబ్బులు ఇవ్వనని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ గొడవలో నర్సింహులు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు ఈ మేరకు ఉదయకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు.

జీపు విక్రయం పేరిట మోసం

చంద్రగిరి : ఓఎల్ఎక్స్ యాప్‌లో జీపు విక్రయానికి ఉందంటూ చంద్రగిరికి చెందిన ఓ యువకుడిని సైబర్ కేటుగాళ్లు మోసం చేసిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది.వివరాలు..చంద్రగిరి బీడీ కాలనీకు చెందిన షేక్ రఫీ అలియాస్ సోను ట్యాక్సీ డ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఓఎల్ఎక్స్ యాప్‌లో నరసాపురంలో ఓ జీపు విక్రయానికి ఉండడం చూశాడు. దీంతో జీపు యజమాని హరి అనే వ్యక్తిని ఫోన్‌లో సంప్రదించాడు. జీపు ధర రూ.40వేలు అని, వెంటనే నగదును పంపిస్తే వేరొకరికి విక్రయించనని నమ్మబలికాడు. దీంతో సోను గురువారం రెండుసార్లు గూగల్‌పే ద్వారా రూ.40వేలు పంపించాడు. నరసాపురం నుంచి వాహనాన్ని చంద్రగిరికి పంపించేందుకు డీజిల్‌కు రూ.10వేలు, డ్రైవరుకు రూ.3వేలు ఇవ్వాలని తెలపడంతో ఆ నగదును కూడా పంపించాడు. మరోసారి జీపు తెలంగాణ రిజిస్ట్రేషన్‌లో ఉందని, వాటిని తనపై మార్చేందుకు మరో రూ.20వేలు కావాలని అడగడంతో ఆ నగదును సైతం బాధితుడు ట్రాన్స్‌ఫర్ చేశాడు. శుక్రవారం వేకువజామున 3 గంటలకు హరి అనే వ్యక్తి మరోసారి సోనుకు ఫోన్ చేయడంతో డీజిల్ కోసం రూ.3500 పంపించాడు. తర్వాత వారి ఫోన్‌లు స్విచ్‌ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు బాధితుడు గ్రహించాడు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనుమానం పెనుభూతమై..!

- భార్య గొంతు కోసి చంపేసిన భర్త

చంద్రగిరి(తిరుచానూరు): అనుమానం పెనుభూతమై వారి కాపురాన్ని ఛిద్రం చేసింది. కట్టుకున్న దాన్ని కర్కశంగా గొంతు కోసి హతమార్చేందుకు ప్రేరేపించింది. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం మంగళంలో భార్యను చంపేసిన భర్త అనంతరం పోలీసులకు లొంగిపోయిన ఘటన సంచలనంగా మారింది. వివరాలు.. మంగళం క్వార్టర్స్‌కు చెందిన రమేష్, తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన రూపావతికి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ కుమార్తెలు చందనప్రియ, కుందన ప్రియతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా రమేష్‌కు తన భార్యపై అనుమానం పెరిగింది. దీంతో తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి.ఈ క్రమంలో 10 రోజుల క్రితం రూపావతి పిల్లలతో కలసి పుట్టింటికి వెళ్లిపోయింది.

పండుగ కోసం ఇంటికి తీసుకొచ్చి..!

అత్తగారింటికి వెళ్లిన భార్యను పండుగగా తీసుకురావాలని గురువారం రమేష్ తన తండ్రి, తమ్ముడితో కలసి ఎస్టీవీ నగర్‌కు వెళ్లాడు. ఇకపై ఇద్దరి మధ్య ఎటువంటి గొడవలు జరగవని, పిల్లలను, భార్యను పోషించుకుంటామని చెప్పి మంగళం క్వార్టర్స్‌లోని ఇంటికి తీసుకువచ్చాడు. శుక్రవారం వేకువజామున రమేష్ పూటుగా మద్యం తాగి ఇంటికి వెళ్లి మరోసారి భార్యతో ఘర్షణకు దిగాడు. ఆగ్రహం పట్టలేక గదిలో నుంచి ఇద్దరు పిల్లలను బయటకు పంపించి, గడియ పెట్టాడు. పిల్లలు కేకలు వేస్తున్నా వినిపించుకోకుండా ఇంట్లోని కత్తి తీసుకుని రూపావతి గొంతు కోసి హతమార్చాడు. భార్య చనిపోయిందని నిర్ధారించుకుని, గది తలుపులు తీసి, పిల్లల వద్దకు వచ్చి మీ అమ్మ చనిపోయిందంటూ కేకలు వేశాడు. అక్కడ నుంచి నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.


పిల్లలతో రూపావతి (ఫైల్), నిందితుడు రమేష్

అనుమానంతోనే హతమార్చాడు : అడిషనల్ ఎస్పీ

భార్యపై అనుమానంతోనే రమేష్ హతమార్చాడని అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్‌తో కలసి ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి తుడా : గణేష్ నిమజ్జనోత్సవానికి వినాయక సాగర్‌లో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ, పోలీసు, ఫైర్, ఇతర విభాగాల అధికారులు, డిప్యూటీ కమిషనర్ అమరయ్యతో కలిసి వినాయక సాగర్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని చవితి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే వాహనాలు క్రమపద్ధతిలో వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో కొలను వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని కోరారు. సాగర్‌ను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని పారిశుధ్య అధికారులను ఆదేశించారు. క్రేన్ల ద్వారా విగ్రహాల నిమజ్జనాన్ని త్వరగా పూర్తి చేసేలా చూడాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ రామకృష్ణ ఆచారి, సీఐ రామ్ కిషోర్, డీఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి

చంద్రగిరి (తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపం వద్ద అమ్మవారికి విద్యుత్‌కాంతుల నడుమ ఉయ్యాలసేవ నిర్వహించారు.. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై, నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఊరేగుతున్న పద్మావతీదేవి

శ్రీవారి సేవలో సినీ నటుడు తుషార్ కపూర్

తిరుమల: తిరుమల శ్రీవారిని సినీ నటుడు తుషార్ కపూర్ శుక్రవారం దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామివారి పట్టు వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.